AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

17-10-2025 (Friday) MAIN EDITION

## ఉపరాష్ట్రపతి నివాసానికి బాంబు బెదిరింపు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. తాజాగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నివాసానికి కూడా బెదిరింపు మెయిల్ వచ్చింది. తమిళనాడు డీజీపీ కార్యాలయానికి ఓ ఈమెయిల్ రాగా.. ఇందులో ఉపరాష్ట్రపతి నివాసంలో బాంబు ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై చర్యలు తీసుకున్నారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కలిసి ఉప రాష్ట్రపతి నివాసానికి చేరిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయితే, తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లేదా అనుమానాస్పద వస్తువులు కనబడలేదు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాక్ రక్షణ మంత్రి కవ్వింపు వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి కవ్వింపు వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘానిస్తాన్‌తో ఇండియా సంబంధాలు పెంచుకోవడంపై అక్కసు వెళ్లగక్కారు. భారత్ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. అవసరమైతే అటు తాలిబాన్లతో, ఇటు భారత్‌తో ఇస్లామాబాద్ రెండు వైపులా యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉందని ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో హెచ్చరించారు. నిర్దిష్ట వివరాలను పంచుకోవడానికి నిరాకరించినప్పటికీ, వ్యూహాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని రెచ్చగొట్టే రీతిలో వ్యాఖ్యలు చేశారు.

## బీసీ బంద్‌కు కవిత మద్దతు



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న బంద్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. బంద్‌కు మద్దతు తెలపాలని జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య ఆమెను కోరారు. ఈ మేరకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు.

## వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి



**అక్షరటుడే, హైదరాబాద్ :** నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో అనస్థీషియా వైద్య విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వైద్య విద్యార్థి నితిన్ గురువారం రాత్రి విధులకు హాజరయ్యాడు. శుక్రవారం ఉదయం ఆపరేషన్ థియేటర్‌లో చనిపోయి ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సింగరేణి కార్మికులకు బోనస్


**అక్షరటుడే, హైదరాబాద్ :** సింగరేణి కాలరీస్ కంపెనీ కార్మికులకు రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. దీపావళి బోనస్ కింద సింగరేణి కార్మికులకు రూ.400 కోట్లు చెల్లిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో ప్రతి సింగరేణి కార్మికుడికి రూ. 1,03,000 చొప్పున పీఎల్ఆర్ బోనస్ డబ్బులు వారి ఖాతాల్లో జమ కానున్నాయి.

## సీబీఐకి చిక్కిన డీఐజీ..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** సీబీఐ వలకు మరో అవినీతి తిమింగలం చిక్కింది. పంజాబ్‌లోని రోపార్ రేంజ్ డీఐజీ హర్‌చరణ్ సింగ్ భుల్లర్‌ను లంచం తీసుకుంటుండగా.. సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గురువారం ఆయన ఇళ్లలో సోదాలు చేపట్టగా.. భారీగా అక్రమాస్తులు గుర్తించారు. పంజాబ్‌లోని 2009 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి భుల్లర్ రూ.8 లక్షల లంచం తీసుకుంటుండగా.. సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ స్క్రాప్ డీలర్‌ను లంచం ఇవ్వాలని వేధించగా.. సీబీఐకి సమాచారం అందించారు. దీంతో సీబీఐ వల పన్ని సదరు అవినీతి అధికారిని పట్టుకుంది. అనంతరం రోపార్, మొహాలి, చండీగఢ్‌లో డీఐజీకి చెందిన నివాసాల్లో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. రూ. 5 కోట్ల నగదుతో పాటు 1.5 కేజీల బంగారం, 22 ఖరీదైన రిస్ట్ వాచులు స్వాధీనం చేసుకున్నారు.

## నకిలీ ఐఏఎస్ అరెస్టు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఐఏఎస్ అధికారిగా చెప్పుకొంటూ ఎందరినో మోసగించి, ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న కేటుగాడు వివేక్ మిశ్రా ఎట్టకేలకు పట్టుబడ్డాడు. లక్నో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిందితుడు మిశ్రా 2014 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా పరిచయం చేసుకునేవాడు. గుజరాత్ సర్కారులో ప్రిన్సిపల్ సెక్రెటరీగా పనిచేస్తున్నట్లుగా చెప్పుకొనేవాడు. ఇలా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు 150 మందిని మోసగించి రూ. 80 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. 2019లో అతడిపై కేసునమోదు కాగా.. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. తాజాగా లక్నో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.




స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం వెనుకబడిన వర్గాలు పోరుబాట పట్టాయి. రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. ఈ క్రమంలోనే శనివారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు, కుల సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి. అయితే, అటు అసెంబ్లీలో బీసీ బిల్లుకు, ఇటు, బంద్‌కు మద్దతు తెలిపిన పార్టీలు.. క్షేత్ర స్థాయికి వచ్చే సరికి మరోలా వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడిదే అంశం తీవ్ర చర్చనీయాంశమైంది. వెనుకబడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించని పార్టీలు.. ఎన్నికల్లో లబ్ధి కోసం మాత్రమే బీసీలను పార్టీలు వాడుకుంటున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# అందరినోటా.. బీసీ మాట..

- రిజర్వేషన్ల కోసం బంద్‌కు బీసీ సంఘాల పిలుపు
- మద్దతు ప్రకటించిన అన్ని రాజకీయ పక్షాలు
- ప్రధాన పార్టీలు మద్దతిచ్చినా లోపించిన చిత్తశుద్ధి
- ఓట్ల లబ్ధి కోసమే నేతల పాకులాట

రిజర్వేషన్ల అంశంపై ప్రధాన రాజకీయ పక్షాల వ్యవహార శైలి చిత్రంగా కనిపిస్తోంది. శనివారం నాటి బంద్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి పార్టీలతో పాటు వామక్షాలు, తెలంగాణ జాగృతి, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. బీసీలకు న్యాయం జరిగే వరకూ ఉద్యమానికి మద్దతుఇస్తామని పేర్కొన్నాయి. అయితే, రాజకీయ పార్టీలు ఎవరి మీద పోరాటం చేస్తున్నాయన్నదే ఇక్కడ అంతు చిక్కని ప్రశ్న. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న అధికార కాంగ్రెస్.. అది కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాధ్యమన్న విషయాన్ని విస్మరించి ఒంటెద్దు పోకడలకు పోయింది. ఇక బంద్‌కు మద్దతు ప్రకటించిన బీజేపీ వైఖరి కూడా విభిన్నంగా ఉంది. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన ఆ పార్టీ.. ముస్లింలను కలుపకుండానే 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని మెలిక పెట్టింది. కాంగ్రెస్ అంగీకరించక పోవడంతో బీసీ బిల్లును మరో రూపంలో అడ్డుకుంది. ఇక బీఆర్ఎస్‌ది కూడా అదే పరిస్థితి. మాట వరుసకే బీసీలకు మద్దతివ్వడం తప్ప చేతల్లో మాత్రం కనిపించడం లేదు. ఇటీవల జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై ఇంప్లీడ్ కావాలన్న బీసీ సంఘాల విజ్ఞప్తిని పట్టించుకోలేదు.

### ఎవరిపై పోరాటం

బీసీలకు మద్దతిస్తాం, రిజర్వేషన్లు సాధించుకునే వారికి పోరాటం చేస్తామని చెబుతున్న పార్టీలు ఎవరిపై పోరాటం చేస్తున్నాయో ఎవరికీ అంతుబట్టని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడిగా అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపించింది. రిజర్వేషన్లు 50 శాతం మించి పోవడంతో ప్రస్తుతం బిల్లులతో పాటు ఆర్డినెన్స్ రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. దీంతో కోర్టుల్లో అది నిలువదని తెలిసీ జీవో ఇచ్చి బీసీలను వంచించింది. ఇక బీజేపీ కూడా బీసీల విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. కేంద్రంలో తమ ప్రభుత్వమే ఉన్నా.. రిజర్వేషన్ల కోసం పోరాడతామంటున్నది. ఎవరి మీద పోరాటం చేస్తారో కాషాయ పార్టీ నేతలే చెప్పాలి.

### లోపించిన ఐక్యత

రిజర్వేషన్ల సాధన విఫలం కావడంలో బీసీ సంఘాల పాత్ర కూడా ఉంది. కొంత మంది గుప్పిట్లో చిక్కుకున్న నాయకులు.. రాజకీయ పార్టీల చేతుల్లో కీలుబొమ్మలా మారారు. అందరూ ఒకతాటిపైకి రావాల్సిన తరుణంలో వెనుకబడిన వర్గాల్లో ఐక్యత లేకపోవడమే శాపంగా మారింది. బీసీ సంఘాలు ఏకమవుతున్న తరుణంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెత్తనం కోసం కొందరు పాకులాడుతుండడం చిచ్చు రేపుతోంది. మొన్న బంద్‌కు బీజేపీ మద్దతు కోరేందుకు వెళ్లిన సమయంలో బీసీ నేతలు ఘర్షణలకు పాల్పడడం కలకలం రేపింది. ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగిన నేపథ్యంలో.. శనివారం నాటి బంద్‌పైనే అందరి దృష్టి నెలకొంది.



## 'స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు'

**అక్షరటుడే, హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను న్యాయస్థానం ప్రశ్నించింది. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను రద్దు చేయడంపై ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది కాదా అని ఈసీని ప్రశ్నించింది. అదే నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని అడిగింది. అయితే ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. దీంతో దానిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వంతో చర్చించాక మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన కోర్టుకు తెలిపారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కోర్టును కోరాయి. దీంతో తదుపరి విచారణను న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది.

## గోషామహల్‌లో హైడ్రా కూల్చివేతలు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలోని గోషామహల్ నియోజకవర్గం కుల్సుంపుర్‌లో కబ్జాలను హైడ్రా అధికారులు శుక్రవారం తొలగించారు. 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్ మండలం పరిధిలోని కుల్సుంపూర్ సర్వే నంబరు 50లో 1.30 ఎకరాల భూమిని అశోక్ సింగ్ అనే వ్యక్తి ఆక్రమించాడు. ఆ స్థలంలో షెడ్లు వేసి విగ్రహాల తయారీ కోసం అద్దెకు ఇస్తున్నాడు. ఈ క్రమంలో హైడ్రా అధికారులు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్లను శుక్రవారం ఉదయం తొలగించారు. రూ. 110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు.

## బాత్‌రూంలో సీక్రెట్ కెమెరా.. ఇంటి యజమాని అరెస్ట్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** అద్దెకు ఉంటున్న వారి ఇంటి బాత్‌రూంలో ఓ వ్యక్తి సీక్రెట్ కెమెరా ఏర్పాటు చేశాడు. హైదరాబాద్ నగరంలో ఈ ఘటన వెలుగు చూసింది. మధురానగర్ పరిధిలోని జవహర్‌నగర్‌లో గల ఓ ఇంట్లో దంపతులు అద్దెకు ఉంటున్నారు. అయితే వారి బాత్‌రూంలో బల్బ్ పని చేయలేదు. దీంతో ఓనర్ అశోక్‌కు తెలపగా.. అక్టోబర్ 4న ఎలక్ట్రీషియన్ చింటు సాయంతో కొత్త హోల్డర్ ఏర్పాటు చేయించాడు. అదే సమయంలో ఇద్దరు కలిసి బల్బ్ హోల్డర్‌లో సీక్రెట్ కెమెరా పెట్టారు. ఈ విషయాన్ని దంపతులు ఇటీవల గుర్తించారు. అనంతరం యజమానికి చెప్పగా.. ఎలక్ట్రీషియన్ చింటు ఏర్పాటు చేసి ఉంటాడని, అతడు మంచి వాడు కాదని వారిని బెదిరించాడు. దీంతో ఆ దంపతులు ఇంటి యజమాని అశోక్‌తో పాటు, ఎలక్ట్రీషియన్ చింటూపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇంటి యజమాని అశోక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎలక్ట్రీషియన్ చింటు పరారీలో ఉండగా.. అతడి కోసం గాలిస్తున్నారు.

## 208 మందితో లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మావోయిస్టుల లొంగు 'బాట' కొనసాగుతోంది. కీలక నేతలు ఆయుధాలు విడిచి ప్రభుత్వం ఎదుట సరెండర్ అవుతున్నారు. తాజాగా మావోయిస్టు అగ్రనేత ఆశన్న లొంగిపోయారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో సరెండర్ అయ్యారు. ఆయనతో పాటు 208 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్, హోంమంత్రి సమక్షంలో నక్సల్స్ తమ ఆయుధాలు అప్పగించారు. ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు బీజాపూర్ మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా పని చేశారు. ఆయనతో పాటు కీలక నేతలు మాడ్ డివిజన్ ఇన్‌ఛార్జి రణిత, నలుగురు స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు సైతం లొంగిపోయారు.

## బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బీజేపీ..



**అక్షరటుడే, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా బీజేపీ అడ్డుపడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు కుల గణన చేపట్టి, సైంటిఫిక్ డేటా ఆధారంగా బిల్లులు రూపొందించామని చెప్పారు. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బిల్లును పాస్ చేయించాలి

బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ధర్నాకు బీజేపీ తప్ప అన్ని పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని భట్టి గుర్తు చేశారు. బీసీలకు న్యాయం చేయాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఈ మేరకు న్యాయస్థానాల్లో సైతం పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించకపోవడంతోనే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి బీసీ బిల్లును పాస్ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ తీరుతోనే రేపు రాష్ట్రంలో బీసీ బంద్ జరుగుతుందన్నారు.

## గ్రీస్ వీధుల్లో ది రాజా సాబ్ బ్యూటీ..

సినీనటి మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటుంది. కేరళకు చెందిన ఈ ముద్దుగుమ్మ సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి నటించిన 'పేట' సినిమాతో ఫేమస్ అయ్యింది. తాజాగా.. ఈ అమ్మడు మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ హీరోయిన్ ప్రస్తుతం గ్రీస్‌లో వెకేషన్ ఎంజాయ్ చేస్తోంది. ఈ ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేయగా వైరల్‌గా మారాయి.

-అక్షరటుడే, సినిమాడెస్క్

